సాక్షి అనకాపల్లి

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



హెటిరో సేవలు అభినందనీయం

విద్యాభివృద్ధికి హెటిరో యాజమాన్యం చేస్తున్న కృషి ప్రశంసనీయమని జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు అన్నారు. 8లో



నేత్రపర్వంగా రథయాత్ర

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి కనకమహా లక్ష్మి అమ్మవారి రథయాత్ర శనివారం వైభవంగా సాగింది. 8లో



ఉపాధి కల్పనే ధ్యేయం

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. 8లో

న్యూస్‌రీల్

ఓల్డ్ ఈజ్ గోల్డ్ !

- మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన ముత్యం లక్ష్మి



రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో డిస్క్‌త్రోలో బంగారు పతకం సాధించిన వెటరన్ క్రీడాకారిణి ముత్యం లక్ష్మి

చోడవరం : వయస్సు దేనికీ అడ్డం కాదని మరో సారి నిరూపించారు వెటరన్ క్రీడాకారిణి ముత్యం లక్ష్మి. వయస్సు మీద పడుతున్నా ఎక్కడా వెనకడుగు వేయకుండా తనకు ఎంతో ఇష్టమైన మాస్టర్స్ క్రీడల్లో పాల్గొని నేటికీ అనేక పతకాలు సాధిస్తున్నారు ఆమె. 80 యేళ్ల వయ స్సులోనూ ఆమె వెటర్ క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించడం అందరికీ ఆదర్శంగా నిలిచారు. తాజాగా రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో చోడవరానికి చెందిన వెటరన్ క్రీడాకారిణి ముత్యం లక్ష్మి రెండు బంగారు పతకాలు సాధించారు. ఈనెల 28, 29 తేదీల్లో గుంటూరులో రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలు జరుగుతున్నాయి. మొదటి రోజు శనివారం జరిగిన పోటీల్లో డిస్క్ త్రో, జావెలిన్ త్రో పోటీల్లో ముత్యం లక్ష్మి మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారు. ఇప్పటికే గత 20 యేళ్లుగా అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి వెటరన్ క్రీడల్లో అథ్లెటిక్స్ విభాగంలో అనేక పోటీల్లో పాల్గొని బంగారు, వెండి, కాంస్య పతకాలు అనేకం సాధించారు. క్రీడలు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తాయనడానికి ముత్యం లక్ష్మి ఒక ఆదర్శం. ఈమె సంపూర్ణ ఆరోగ్య వంతురాలుగా ఉంటూ ఎక్కడా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా మాస్టర్స్ క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించడంపై చోడవరం ప్రజలు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు



మాకవరపాలెం తహసీల్దార్ కార్యాలయం

మాకవరపాలెం : తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు. గత నెల 8న భూమి మ్యుటేషన్ చేసేందుకు రూ.15,000 లంచం తీసుకుంటూ తామరం వీఆర్వో లక్షణరావు ఏసీబీ అధికారులకు పట్టుబడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం ఏసీబీ అధికారులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం నుంచి వివిధ రికార్డులను పరిశీలించారు. కంప్యూటర్‌లో పొందుపరిచిన ఆన్‌లైన్ భూ రికార్డులను కూడా తనిఖీలు చేశారు. పలు అంశాలకు సంబంధించి వివరాలు నమోదు చేసుకున్నారు. గత నెల వరకు భూములు ఆన్‌లైన్ చేసే కంప్యూటర్ ఆపరేటర్‌తో కూడా మాట్లాడి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. సుమారు ఐదు గంటలపాటు జరిగిన ఏసీబీ అధికారుల తనిఖీలతో మరోసారి రెవెన్యూ సిబ్బంది ఉలిక్కిపడ్డారు.

ఆయుర్వేదంతో.. ఆరోగ్యమస్తు!


SUNDAY SPECIAL

- మారుతున్న ఆస్పత్రుల రూపురేఖలు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఆధునికీకరణకు నిధుల కేటాయింపు
- జిల్లాలో 6 ఆస్పత్రుల ద్వారా వైద్యసేవలు
- కన్నూరుపాలెంలో పంచకర్మ చికిత్సకు ప్రత్యేక విభాగం
- ప్రతి నెలా 6 వేలకు పైగా రోగులకు వైద్య చికిత్సలు



సాక్షి, అనకాపల్లి :

ఆయుర్వేద వైద్యానికి ఆదరణ పెరుగుతుంది. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుపడుతున్న రోగులు ఎక్కువగా ఆయుర్వేదిక్ వైద్యం పట్ల ఆసక్తి చూపుతున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం నుంచే అనకాపల్లి జిల్లాలో కొరుప్రోలు, వేంపాడు, కన్నూరుపాలెంలలో ఆయుర్వేదిక్ డిస్పెన్సరీల ద్వారా వైద్యం అందించేవారు. తొలుత దాతల సహాయంతోనే ఈ ఆయుర్వేదిక్ ఆసుపత్రుల నడిచేవి. దాతలు భూమిని సమకూర్చడంతో పెంకులతో భవనం నిర్మించి, అందులోనే వైద్య సేవలు ప్రారంభించారు. వైద్యునితోపాటు ఆరోగ్య సిబ్బందిని నియమించి సేవలందిస్తూ వచ్చారు. కాలక్రమంలో ఈ డిస్పెన్సరీ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో 2013లో ఎస్ఆర్‌హెచ్ఎం నిధులతో నూతన భవనాలను నిర్మించారు.



జిల్లాలో ఆరు ఆస్పత్రులు

అనకాపలి జిల్లాలో ఎన్‌టీఆర్ ఆసుపత్రిలో, ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు, నక్కపల్లి మండలం వేంపాడు, కశింకోట మండలం కన్నూరుపాలెం, నర్సీపట్నం, ఎం.కోడూరులో 6 ఆయుర్వేద ఆస్పత్రులు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లుగా అప్‌గ్రేడ్ చేశారు. గత ఏడాది ఆగస్టులో ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు ఆయుర్వేద కేంద్రాన్ని స్పెషలిస్ట్ వెల్‌నెస్ అండ్ పంచకర్మ సెంటర్‌గా అప్ గ్రేడ్ చేశారు. వాటితో పాటుగా ఆరు ఆస్పత్రులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు కేటాయించారు.

ఆరు వెల్‌నెస్ సెంటర్ల ఆధునికీకరణ

జన ఆరోగ్య సమితి కమిటీని ఏర్పాటు చేసి ఆస్పత్రుల భవనాల ఆధునికీకరణ పనులు పూర్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఒక్కో ఆస్పత్రిని రూ.3.5 లక్షలతో ఆధునికీకరించారు. అదనపు సౌకర్యాలు కల్పించి ప్రజలకు విస్తృతంగా వైద్య సేవలందిస్తున్నారు.

కశింకోట మండలంలోని కన్నూరుపాలెం ఆస్పత్రిని ఆయుర్వేదిక్ హెల్త్ అండ్ వెల్నెస్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తున్నారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలోని ఆయుష్ విభాగంలో మౌలిక వసతులకు రూ.3.50 లక్షలు మంజూరు చేసింది. తాజాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆయుష్మాన్ భారత్ కింద ఆయుర్వేదిక్ ఆస్పత్రులను అభివృద్ధి చేసి, సేవల్ని విస్తృత పరచాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే జిల్లాలోని వేంపాడు, కొరుప్రోలు, కన్నూరుపాలెం ఆయుర్వేదిక్ ఆస్పత్రుల అభివృద్ధికి మొత్తం రూ.10.5 లక్షలు వెచ్చిస్తున్నారు. ఎన్నికల సమయంలో నిలిచిన పనులు మూడు నెలలుగా తిరిగి కొనసాగాయి.

పంచకర్మ నుంచి జలగ వైద్యం వరకూ...

సగటున ఒక్కో ఆస్పత్రిలో నెలకు 900 నుంచి 1000 మంది వరకూ రోగులకు వైద్యసేవలందుతున్నాయి. జిల్లాలోని ఆరు ఆస్పత్రుల్లో 5 వేల నుంచి 6 వేల మందికి వైద్య సేవలందుతున్నాయి. ఆస్పత్రిలో పక్షవాతం, మోకాళ్లు, కీళ్ల నొప్పులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో పాటుగా పంచకర్మ చికిత్సలో అభ్యంగం, స్వేద కర్మ, పిండస్వేద కటివస్తి, జానువస్తి, గ్రీవ వస్తి, క్షారసూత్ర, అగ్రికర్మ, జలగ వైద్యంతో పాటుగా అనేక వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడ ప్రస్తుతం రోజుకు 40 నుంచి 45 మంది వరకూ రోగులు వస్తున్నారు.

యోగా, ధ్యానం..

ఆరోగ్యాన్ని పెంచే యోగాపై అవగాహన కలిగించేందుకు ఆయుర్వేదిక్ డిస్పెన్సరీలలో శిక్షకులను నియమించారు. వారిలో ఒకరు యోగా, ధ్యానం నేర్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోగ్య మేళాలు గ్రామాల్లో విరివిగా నిర్వహించి ఆయుర్వేద వైద్యం పట్ల ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారు.



ఆయుర్వేద వైద్యశాల

పంచకర్మ థెరపీ..

ఆయుర్వేద పంచకర్మ చికిత్స కోసం కేరళ, తమిళనాడు, కర్ణాటకకు ప్రత్యేకంగా థెరపీ వైద్యం కోసం వెళుతుంటారు. అదే తరహా కేరళ మెడికేటెడ్ ఆయిల్ ద్వారా వైద్యం అనకాపల్లి జిల్లాలో ఆయుర్వేద వెల్‌నెస్ సెంటర్లల్లో కూడా అందిస్తున్నారు. పంచకర్మ థెరపీ ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. నస్య, వమన, విరేచన, వస్తి, రక్త మోక్షణ వంటి థెరపీల ద్వారా చికిత్సలు అందిస్తున్నారు.

వమన

సొరియాసిస్, రెస్పిరేటరీ వంటి దీర్ఘకాలిక సమస్యలకు అందించే ఆయుర్వేదిక్ వైద్యం. థెరపిటిక్ మెడిసిన్ ఇచ్చి వాంతులు చేయించి తద్వారా శ్వాసకోశ వ్యవస్థ మెరుగ్గా పనిచేసేలా సహాయపడుతుంది..

విరేచన

కడుపు ఉబ్బరం, అల్సర్ ఇతర దీర్ఘకాలిక సంబంధిత వ్యాధుల్లో కడుపులో విరేచన ద్వారా క్లీన్ చేయించి ఈ థెరపీ చేస్తారు. దీని ద్వారా కడుపు క్లీనింగ్ అయి లివర్, జీర్ణాశయం, కిడ్నీలు సక్రమంగా పనిచేసేలా థెరపీ చేస్తారు.

వస్తి..

మగ,ఆడ వారిలో వెన్నుపూస, స్పైనల్ కార్డు వంటి సమస్యల్లో ఈ థెరపీ వాడతారు. మైక్రో ఛానల్ ద్వారా ఆయిల్ రాసి ఈ చికిత్స అందిస్తారు

రక్త మోక్షణ...

శరీరంపై వివిధ అవయవాలల్లో దీర్ఘకాలికంగా పుండ్లుగా ఏర్పడి వాటి నుంచి రసి కారి కుళ్లిపోతే.. అక్కడ ఈ థెరపీ ద్వారా చెడు రక్తం తీసే చికిత్స ఇది. ఈ చికిత్స వచ్చే నెల నుంచి ప్రారంభమవుతుంది.



ఔషధ మొక్కల తోట



ధ్యానంపై శిక్షణ



ఆయుర్వేద వెల్‌నెస్ సెంటర్‌లో ఓపీ సేవలు

అవగాహన పెరిగింది..



జిల్లాలో ఆరు ఆయుర్వేదిక్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల ద్వారా వైద్యసేవల అందిస్తున్నాం. కేరళలో లభ్యమయ్యే మెడికేటెడ్ ఆయిల్‌తో థెరపీ వైద్యం అందుబాటులో ఉంది. ప్రతి ఆస్పత్రిలో ఇద్దరు థెరపిస్టుల ద్వారా వైద్యసేవలందిస్తున్నాం. ఆయుర్వేదిక్ వైద్యం పట్ల ప్రజల్లో అవగాహన పెరిగింది. ఎక్కువగా దీర్ఘకాలికంగా వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులు వైద్యం కోసం వస్తున్నారు. పంచకర్మ థెరపీతో పాటు అదనంగా ఐఆర్ థెరపీ ద్వారా మోకాళ్ల నొప్పి వంటి సమస్యలకు వైద్య సేవలందిస్తున్నాం. ప్రజలకు ఆశాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఆస్పత్రి ఆవరణలో ఔషధ మొక్కలు, హెర్బల్ గార్డెన్ కూడా పెంచుతున్నాం.

–కె.లావణ్య, ఆయుష్ విభాగం వైద్యాధికారి, జిల్లా ఆయుర్వేదిక్ డిస్పెన్సరీ

వన నర్సరీల ద్వారా 5 కోట్ల మొక్కల పంపిణీ లక్ష్యం

- వచ్చే ఏడాది జూలై నుంచి మొక్కల పంపిణీకి చర్యలు
- అడిషనల్ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రాహుల్ పాండే
- కె.కోటపాడు మండలంలో నాలుగు వన నర్సరీల పరిశీలన



కొత్త అగ్రహారంలో వన నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అడిషనల్ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రాహుల్ పాండే

కె.కోటపాడు : రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ ఫారెస్ట్ ద్వారా 5 కోట్ల మొక్కలను పంపిణీ చేసేందుకు వన నర్సరీలలో పెంచుతున్నట్లు అడిషనల్ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రాహుల్ పాండే అన్నారు. మండలంలో కొత్త అగ్రహారం, సింగన్నదొరపాలెం, కొత్తూరు, బత్తివానిపాలెం గ్రామాల్లో సోషల్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో పెంచుతున్న పలు రకాల మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాహుల్ పాండే మాట్లాడుతూ మొక్క నాటేందుకు అనువైందిగా ఉండాలంటే నర్సరీలలో తప్పనిసరిగా కనీసం ఏడు నెలల పాటు పెంచాలని తెలిపారు. వచ్చే ఏడాది వర్షాలు ప్రారంభమయ్యేందుకు అనువైన కాలం అయిన జూలై నుంచి నర్సరీలలో గల మొక్కలను పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. వర్షాలు ఒక వేళ ముందుగా పడితే ఈ నిర్ణయాన్ని పునరాలోచన చేసి ముందుగా పంపిణీ చేసే పరిస్థితి ఉంటుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2024–25 కాలానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్, కంపా, సేల్ ఆఫ్ సీలింగ్స్, ఎస్ టీపీసీ నిధులతో పెంచుతున్న 5 కోట్ల మొక్కలను అందించనున్నట్టు ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే కంపా నిధులతో 50 లక్షల మొక్కలను పెంచుతున్నట్టు రాహుల్ పాండే తెలిపారు. రైతులకు ఉచితంగా నర్సరీల్లో గల మొక్కలను ఇవ్వడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ స్థలాల్లోను, రోడ్ల కిరువైపులా మొక్కలు నాటేందుకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సింగన్నదొరపాలెం, కొత్తూరు, కొత్త అగ్రహారం నర్సరీలలో పెంచుతున్న కాము, వేప, నేరేడు, పనస, కానుగ, తురాయి, ఎర్ర చందనం, టేకు తదితర మొక్కలనుపరిశీలించి మొక్కల సంరక్షణపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో జి.లక్ష్మణ్, ఫారెస్ట్ రేంజ్ అధికారి చంద్రశేఖర్, డీఆర్‌వో ఎ.నూకరాజు, వన సేవకుడు చిరికి గోవింద పాల్గొన్నారు.

పేదలకు సొంతిల్లు ఇక కలేనా !



నిబంధనలు కఠినతరం

పేదల ఆశలపై నీళ్లు చల్లిన కూటమి సర్కారు

నర్సీపట్నం : పేద ప్రజలకు సొంతింటి కల నెరవేర్చాలన్న ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇంటి స్థలంతో పాటు పక్కాగృహం మంజూరు చేసింది. గ్రామాల్లో సొంత స్థలం ఉన్న సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు పక్కాగృహాలు కేటాయించింది. ఈ గృహాలకు గత ప్రభుత్వంలో గ్రామీణ హౌసింగ్ స్కీమ్ రూ.లక్షా 80 వేలు, అర్బన్ రూ.2.50 లక్షలు ఇచ్చే వారు. ఇవే స్కీమ్‌లకు కూటమి ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. కూటమి ప్రభుత్వం ప్రచారంలోకి తీసుకొచ్చిన రూ.4 లక్షల హౌసింగ్‌కు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని హౌసింగ్ అధికారులు పేర్కొంటున్నారు. పాత స్కీమ్‌లకు కూటమి ప్రభుత్వం బోలెడన్నీ నిబంధనలు విధించి పేదల సొంతింటి కలపై నీళ్లు చల్లింది.

ల్యాండ్ డాక్యుమెంట్ తప్పనిసరి

సొంత స్థలాలు కలిగి ఉండి ఇళ్ల నిర్మాణాలు చేపట్టే వారికి పలు పత్రాలను సమర్పించాలని ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. ల్యాండ్ డాక్యుమెంట్ తప్పనిసరి చేసిందని ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. గ్రామకంఠంలో ఉండే ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల స్థలాలకు ఎలాంటి డాక్యుమెంట్లు లేవు. వారంతా సతమతమవుతున్నారు. ప్రభుత్వం విధించిన నిబంధనలపై కూటమి నాయకుల సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో పేదలకు పూర్తి సహకారం...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణం మొదలుకుని పూర్తి అయ్యేవరకు అడుగడుగునా సాయమందించింది. నియోజకవర్గంలోని 2,977 పక్కాగృహాలు కేటాయించింది. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు మూడు విడతల్లో అందజేసింది. బేస్‌మెంట్ దశలో సిమెంట్, స్టీల్‌తో కలుపుకొని రూ.70 వేలు, లింటల్ స్థాయిలో రూ.54 వేలు, రూఫ్ స్థాయిలో రూ.25 వేలతో పాటు, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.30 వేల చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లు మొత్తం జమ చేసింది.

అలాగే రాయితీపై 90 బస్తాల సిమెంట్, 420 కిలోల స్టీల్ అందజేయడంతో పాటు 20 టన్నుల ఇసుక ఉచితంగా సరఫరా చేసింది. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి కిటికీల, బాత్‌రూం డోర్ ఫ్రేమ్‌లు, ఎలక్ట్రికల్ సామాగ్రిని రాయితీపై అందజేసి అడుగడుగునా పేద కుటుంబాలను ఆదుకుంది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొత్త గృహాలు మంజూరు చేయకపోగా, నిబంధనలను కఠినతరం చేసింది. పాత స్కీమ్‌లకు ప్రభుత్వం విధించిన నిబంధనలతో ఏ ఒక్కరికీ ఇల్లు వచ్చే పరిస్థితి లేదని ఇటు ప్రజలు అటు కూటమి నేతలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

కొత్త మార్గదర్శకాలిలా..

- విధిగా ల్యాండ్ డాక్యుమెంట్
- లబ్ధిదారుల కుటుంబంలోని సభ్యులందరి ఆధార్ వివరాలు సమర్పించాలి
- ఆదాయ ధ్రువీకరణపత్రం
- కుల ధ్రువీకరణపత్రం
- రేషన్‌కార్డులు
- పై డాక్యుమెంట్లను సమర్పిస్తేనే లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి వీలుపడుతుందని హౌసింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

సాగరం.. సాహసం..



ఉత్కంఠభరితంగా నేవీ సన్నాహక విన్యాసాలు

రణరంగంలా మారిన ఆర్‌కే బీచ్

సాగర జలాల్లో యుద్ధ నౌకల కవాతు.. గగనతలంలో హెలికాప్టర్ల పహారా.. శత్రుమూకలపై మార్కోస్ ఉప్పెనలా దాడి.. దూసుకొచ్చిన మిస్సైల్స్.. దానితో పోటీ పడేటట్లుగా మెరుపు వేగంతో వెళ్లిన యుద్ధ విమానాలు.. మొత్తంగా ఆర్.కె.బీచ్ రణరంగాన్ని తలపించింది. ఉత్కంఠభరితంగా సాగిన నేవీ రిహార్సల్స్.. ఉవ్వెత్తున ఎగిసి పడిన జనసంద్రం నడుమ ఉద్వేగాన్ని, ఉత్సాహాన్ని నింపాయి. జనవరి 4న జరిగే నేవీ విన్యాసాల్లో భాగంగా శనివారం జరిగిన రిహార్సల్స్ సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. విన్యాసాల్లో చేతక్ హెలికాప్టర్లు, యుద్ధ విమానాలు, సబ్‌మెరైన్‌లు, మెరైన్ కమాండోల విన్యాసాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మెరైన్ కమాండోలు తాడు సహాయంతో హెలికాప్టర్ నుంచి దిగి.. శత్రువులను ఓడించే నమూనా ప్రదర్శన చూపించారు. పారాచూట్‌లతో దిగిన నావికా సిబ్బంది ప్రత్యేక జ్ఞాపికను అతిథికి అందజేశారు. యుద్ధ నౌకలపై హెలికాప్టర్ల ల్యాండింగ్, హాక్ యుద్ధ విమానాల విన్యాసాలు, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల ప్రదర్శన ఆకట్టుకుంది. సీ క్యాడెట్ విద్యార్థుల నృత్య ప్రదర్శన క్రమశిక్షణకు అద్దం పట్టింది.

విశాఖ సాగరతీరంలో యుద్ధ నౌకలు, హెలీకాప్టర్ల విన్యాసాలు, మెరైన్ కమాండోల సాహస కృత్యాలు

‘గోవాడ సుగర్స్’లో సమ్మె విరమణ



కార్మికులతో మాట్లాడుతున్న ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడు

చోడవరం : కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని గోవాడ సుగర్స్ యాజమాన్యం హామీ ఇవ్వడంతో కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెను శనివారం విరమించారు. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుర్తింపు కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులంతా గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో శుక్రవారం నుంచి విధులను నిలిపివేసిన సంగతి తెలిసిందే. రెండో రోజు శనివారం కూడా కార్మికులంతా విధులను బహిష్కరించారు. దీంతో కార్మికుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.వి. సన్యాసినాయుడు హామీ ఇచ్చారు. కార్మికులకు రావలసిన జీతభత్యాలు నేటి వరకూ చెల్లించలేదని, రెండేళ్లుగా కార్మికులకు ఇవ్వాల్సిన ఓటీల డబ్బులు ఇవ్వలేదని, గతేడాది నుంచి డీఓలు ఇవ్వలేదని, ఇవన్నీ వెంటనే చెల్లించాలని కార్మిక సంఘం అధ్యక్షుడు కె.వి.వి.భాస్కరరావు డిమాండ్ చేశారు. వీటిని ఒక్కొక్కటిగా అవకాశం ఉన్నంతమేర చెల్లింపులు చేస్తామని, క్రషింగ్ సీజన్ ప్రారంభమవ్వడంతో వెంటనే కార్మికులంతా విధుల్లోకి చేరాలని ఎండీ కోరారు. ఆయన హామీ మేరకు సమ్మెను విరమించి విధుల్లోకి వెళతామని యూనియన్ అధ్యక్షుడు భాస్కరరావు చెప్పారు.

క్లుప్తంగా

సైకిల్‌పై నక్కపల్లి నుంచి శబరిమల యాత్ర



నక్కపల్లి నుంచి శబరిమల సైకిల్‌పై బయలు దేరిన భక్తులు

నక్కపల్లి : నక్కపల్లికి చెందిన ఐదుగురు భక్తులు సైకిల్‌పై శబరిమల మొక్కుతీర్చుకునేందుకు బయలు దేరారు. నక్కపల్లికి చెందిన కొల్నాటి గోవిందరాజు, గోవాడ అప్పారావు, బి.రాము, బొద్దపు సూరిబాబు, పొన్నాడ నారాయణరావు అయ్యప్ప దీక్ష చేపట్టారు. 15 రోజులపాటు 1500 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణం చేసి మకరజ్యోతికి శబరిమల వెళ్లి అయ్యప్పస్వామి దర్శనం చేసుకునేందుకు బయలు దేరారు. గురుస్వామి గోవిందరాజు మాట్లాడుతూ ఐదేళ్లనుంచి శబరిమల యాత్ర సైకిల్‌పై దిగ్విజయంగా పూర్తి చేస్తున్నామన్నారు. సైకిల్‌పై యాత్ర చేయడం వల్ల స్వామి అనుగ్రహంతోపాటు, మానసికంగా శారీరకంగా నూతన ఉత్తేజం కలుగుతోందన్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ ఏడాది పూర్తి చేసేలా అయ్యప్ప స్వామిని కోరుకుంటున్నామన్నారు.

ఈఐఎల్ నికర విలువ రూ. 267.19 కోట్లు

ఉక్కునగరం: ఉక్కు మంత్రిత్వశాఖ అడ్మినిస్ట్రేటివ్ నియంత్రణలో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్ అనుబంధ సంస్థ ఈస్టర్న్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ (ఈఐఎల్) నికర విలువ రూ. 267.17 కోట్లు అని, 2023–24లో ఆ సంస్థ రూ. 2.10 లక్షలు నికర లాభం అర్జించిందని స్టీల్‌ప్లాంట్, ఈఐఎల్ నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఎ.కె.సక్సేనా తెలిపారు. శనివారం ఉక్కు పరిపాలన భవనంలో వీడియో కాన్ఫరెన్సింగ్‌లో ఈఐఎల్ 97వ వార్షిక సాధారణ సమావేశం జరిగింది. సమావేశంలో సక్సేనా మాట్లాడుతూ ఈఐఎల్ అనుబంధ సంస్థ ఒరిస్సా మినరల్స్ డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (ఓఎండీసీ) 2022–23లో రూ.16.54 కోట్లు నికర నష్టం సాధించగా 2023–24లో రూ. 2.82 కోట్లు నికర లాభం ఆర్జించిందన్నారు. మరో అనుబంధ సంస్థ బిస్రో స్టోన్ లైమ్ కంపెనీ లిమిటెడ్ (బీఎస్ఎల్‌సీ) 2022–23లో రూ.11.74 కోట్లు నికర లాభం సాధించగా, 2023–24లో రూ.2.29 కోట్లు నికర లాభం అర్జించిందన్నారు. ఈ సంస్థల నిర్వహణలో సహకరిస్తున్న అన్ని సంస్థలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉక్కు మంత్రిత్వశాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఈఐఎల్ ప్రభుత్వ డైరెక్టర్ స్వప్న భట్టాచార్య న్యూఢిల్లీ నుంచి ఆన్‌లైన్‌లో హాజరయ్యారు. ఈఐఎల్ ఎండీ ఎస్.సి.పాండే, ఈఐఎల్ కంపెనీ సెక్రటరీ ఎస్.రాజబాబు, స్టీల్‌ప్లాంట్ కంపెనీ వ్యవహారాల ఏజీఎం కె.హేమరాజు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రథయాత్ర

డాబాగార్డెన్స్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి రథయాత్ర శనివారం వైభవంగా సాగింది. కళాకారుల పులివేషాలు, చెక్కభజన, కోలాటం, నవదుర్గల ప్రదర్శనలు రథయాత్రకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారి మాలధారణ భక్తులు పూర్ణ కలశాలతో యాత్రలో పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించకుండా పనులా ?

- ఏపీఐఐసీ పనులు అడ్డుకున్న నిర్వాసిత రైతులు



రాజయ్యపేట సమీపంలో జేసీబీతో చేస్తున్న పనులు అడ్డుకున్న రైతులు

నక్కపల్లి: భూములిచ్చిన రైతులు సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించకుండా, వారికి నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించకుండా పనులు ఎలా చేస్తారంటూ పలువురు నిర్వాసిత రైతులు, సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీఐఐసీ వారు సేకరించిన భూముల్లో ప్రారంభించిన పనులను శనివారం వారు అడ్డుకున్నారు. నక్కపల్లి మండలంలో బల్క్‌డ్రగ్ పార్క్, స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి వచ్చే నెల 8వ తేదీన ప్రధాని నరేంద్రమోదీతో శంకుస్థాపన చేయించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీనికి సంబంధించి రాజయ్యపేట సమీపంలో ఏపీఐఐసీ వారు సేకరించిన భూముల్లో శనివారం చదును చేసే పనులను ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. జిల్లా రైతు సంఘ నాయకులు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. అప్పలరాజు ఆధ్వర్యంలో పలువురు నిర్వాసిత రైతులు రాజయ్యపేట సమీపంలో పొక్లెయిన్లతో భూములు చదును చేసే పనులను అడ్డుకున్నారు. ఏపీఐఐసీకి భూములు ఇచ్చిన రైతులకు ఇంకా పూర్తిస్థాయిలో సెటిల్‌మెంట్ చేయలేదన్నారు. 2013 చట్టం ప్రకారం గత టీడీపీ ప్రభుత్వం ప్రకటించిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదన్నారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించలేదన్నారు. ఇళ్లు ఖాళీ చేస్తున్న నిర్వాసితులకు పునరావాసం ఎక్కడ కల్పిస్తారో ఇంతవరకు ప్రకటించలేదన్నారు. కంపెనీల కోసం భూములిచ్చిన డీఫారం రైతులకు, ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న వారికి పరిహారం చెల్లించలేదన్నారు. ఈ విషయంపై కలెక్టర్, హోం మంత్రిలకు ఫిర్యాదు చేశామని, గతంలో పనులు ప్రారంభిస్తే అడ్డుకుని ధర్నాలు చేశామన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించిన తర్వాతే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఏకపక్షంగా చేయడం తగదన్నారు. నిర్వాసితులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన తర్వాతే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిరాయితీ భూముల్లో ఇళ్లు కోల్పోతున్న వారికి రూ.25 లక్షలు, ఉపాధి కోల్పోయిన వారికి రూ.15 లక్షలు ప్యాకేజీ చెల్లించాలన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లింపునకు సంబంధించి కటాఫ్ తేదీ మార్చాలని, భూములు స్వాధీనం చేసుకున్న తేదీనే కటాఫ్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిర్వాసిత కుటుంబాల్లో 18 ఏళ్లు నిండిన వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.15 లక్షలు ప్యాకేజీ ఇవ్వాలన్నారు. ఇవేమి పరిష్కరించకుండా శంకుస్థాపన చేస్తామంటే ఒప్పుకునేది లేదన్నారు. జనవరి 8వ తేదీన ప్రధానితో శంకుస్థాపన చేయిస్తామని ముఖ్యమంత్రి, హోం మంత్రి, ఎంపీ ప్రకటించడం భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘించడమేనన్నారు. జేసీబీలతో భూములు చదును చేసి కంపెనీ అవసరాల కోసం రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడం, విద్యుత్, తాగునీటి సదుపాయాలు కల్పించే పనులను ప్రభుత్వం ఆగమేఘాల మీద చేస్తోందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో వీటిని అడ్డుకుని తీరుతామన్నారు. ఈ ఆందోళనలో సీపీఎం మండల కన్వీనర్ ఎం. రాజేష్, రైతులు సోమేశ్వరరావు, ఎం. బయ్యన్న, కె. కాశి, భూలోక, అప్పలరాజు, సిహెచ్ సోమేష్, బి. నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో పీసా కమిటీ ఎన్నికలు

- నాతవరం మండలంలో ఐదు పంచాయతీల్లో ఎన్నికలు
- పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆధ్వర్యంలో నిర్వహణ
- 3,4 తేదీల్లో పీసా కమిటీ ఉపాధ్యక్షుడు, కార్యదర్శి ఎన్నికలు
- అదే రోజు నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఎన్నికలు
- చేతులెత్తి విధానంలో ఎన్నిక
- జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి నాగశిరీష

నాతవరం : వచ్చే నెల 3,4, తేదీల్లో 1/70 యాక్టు పరిధిలో ఉన్న ఐదు పంచాయతీల్లో పీసా కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగ శిరీష అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో శనివారం ఎన్నికల అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని నాతవరం మండలంలో సరుగుడు, సుందరకోట, మాధవనగరం, చమ్మచింత, కె.వి.శరభవరం పంచాయతీలు షెడ్యూలు ఏరియా పరిధిలో ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల్లో గిరిజనుల జనాభా అధికంగా ఉండడంతో పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆధ్వర్యంలో పీసా కమిటీ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. సరుగుడు, రామన్నపాలెం, మాధవనగరం, చమ్మచింత, సుందరకోట, సిరిపురం, కొండధర్మవరం, కృష్ణాపురం అగ్రహారం, కురువాడ గ్రామాల్లో పీసా కమిటీ ఎన్నికలు నిర్వహిస్తామని ఉపాధ్యక్షుడు, కార్యదర్శిని చేతులెత్తే పద్ధతిలో ఎన్నుకుంటారని అన్నారు. ఆయా పంచాయతీలో పీసా కమిటీలకు స్థానిక సర్పంచ్ అధ్యక్షుడుగా ఉంటారన్నారు. ఎన్నికలు జరిగే గ్రామాల్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారులను నియమించామన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా నిర్వహించే పీసా కమిటీ ఎన్నికల్లో పార్టీల జెండాలు, బ్యానర్లు పోలింగ్ ప్రదేశాలలో ఉండరాదన్నారు. ఎన్నికలు జరిగే గ్రామాల్లో ముందుగా దండోరా వేయించి ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. గిరిజన ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి పనులైనా, సంక్షేమ పథకాలు అమలు పీసా కమిటీల ఆమోదం మేరకే జరుగుతుందన్నారు. పీసా కమిటీ ఎన్నికలకు సంబంధించి పూర్తి అధికారాలు పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికే ఉంటాయన్నారు. ఒకేరోజు నామినేషన్ల ఉపసంహరణ, పరిశీలన, ఎన్నికలు ఉంటాయన్నారు. అభ్యంతాలు ఏమైనా ఉంటే 60 రోజుల లోపు రాష్ట్ర గిరిజన శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చున్నారు. 90 రోజులలోపు రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఉపాశ్రీ, తహసీల్దార్ ఎ.వేణుగోపాల్, ఎస్ఐ సిహెచ్.భీమరాజు, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, పంచాయతీ విస్తరణాధికారి మూర్తి, ఎన్నికల నిర్వహణధికారులు పాల్గొన్నారు.



పీసా కమిటీ ఎన్నికల నిర్వహణపై అధికారులకు శిక్షణ ఇస్తున్న పంచాయతీ విస్తరణాధికారి మూర్తి

విద్యాభివృద్ధికి హెటెరో సేవలు అభినందనీయం

- టెన్త్ విద్యార్థులకు రూ.10లక్షలు విలువైన స్టడీ మెటీరియల్ పంపిణీ
- మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కంపెనీ సీఎస్ఆర్ హెడ్ సుధాకర్

నక్కపల్లి : మండలంలో విద్యాభివృద్ధి కోసం హెటిరో కంపెనీ యాజమాన్యం చేస్తున్న కృషి ప్రశంసనీయమని, వారి పాత్ర ఎంతో కీలకంగా మారిందని జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు అన్నారు. శనివారం నక్కపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలంలో వివిధ జెడ్పీ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు హెటిరో కంపెనీ యాజమాన్యం సహకారంలో డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను కంపెనీ డీజీఎంలు కుళ్లాయి రెడ్డి, సుబ్బారెడ్డి, సీఎస్ఆర్ హెడ్ సుధాకర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ 15 సంవత్సరాల నుంచి కంపెనీ యాజమాన్యం పదో తరగతి విద్యార్థుల కోసం రూ.10 లక్షల విలువైన స్టడీ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేస్తోందన్నారు. ఈ మెటీరియల్‌ను ఉపయోగించుకుని విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలన్నదే కంపెనీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి ప్రధాన ఉద్దేశ్యమన్నారు. అలాగే పదోతరగతి పరీక్ష ఫలితాల్లో మొదటి, రెండు, మూడు ర్యాంకులు సాధించిన వారికి వరుసగా రూ.10వేలు, రూ.7500, రూ.5 వేల చొప్పున నగదు పురస్కారాలను కూడా ప్రకటించి అందజేయడం జరుగుతోందన్నారు. పేద విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంచడం , ఉన్నత చదువులకు ఈ ప్రోత్సాహకాలు ఉపయోగపడతాయనే ఉద్దేశ్యంతోనే ఈ నగదు పురస్కారాలను అందజేయడం జరుగుతోందన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయలు కూడా కల్పిస్తున్నామన్నారు. ఆర్‌వో ప్లాంట్లు, ఆధునిక సౌకర్యాలతో కంప్యూటర్ ల్యాబ్‌లు, మరుగుదొడ్లు, డైనింగ్ హాళ్లు, ప్రహరీ గోడల వంటి పనులు సీఎస్ఆర్ నిధులతో చేపట్టడం జరిగిందన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో కంపెనీ నిధులతో వలంటీర్లను నియమించి విద్యాబోధనకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉత్తమ ఫలితాలు సాధిస్తూ పాఠశాలలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. పదోతరగతి పరీక్షల్లో 10/10 సాధించి ఉన్నత చదువులు చదువుకునే స్తోమత లేని పేద విద్యార్థులకు కంపెనీ యాజమాన్యం తోడ్పాటునందిస్తోందన్నారు. నక్కపల్లిలో బీఎస్ హాకీ క్లబ్ కోసం రూ.10లక్షలతో క్రీడామైదానాన్ని తయారు చేసి అప్పగించడం జరిగిందన్నారు. విద్యతోనే సామాజిక అభివృద్ధి ముడిపడి ఉంటుందన్నారు. ఎంఈవోలు కుంచం నరేష్, వేమగిరి నూకరాజు, హెచ్ఎంలు రాణిలలిత, సత్యారావు, సత్యనారాయణ, సువర్ణకుమారి, సలీమా, ఎన్.వి.ఎస్ ఆచార్యులు, టి.వి.రమణ కంపెనీ సిబ్బంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు స్పందన కరువు

- జగనన్న భూ రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం
- రెండు సదస్సుల్లోనూ ఖాళీ కుర్చీలే దర్శనం



రైతులు రాకపోవడంతో రెవెన్యూ సదస్సులో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

నాతవరం : మండలంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు భూ సమస్యలు చెప్పుకునే రైతులు కరువయ్యారు. గత ప్రభుత్వంలో జగనన్న భూ రీసర్వే చేసిన డొంకాడ అగ్రహారం అడవికామయ్య అగ్రహారం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గతంలో భూ రీసర్వే చేసి రైతులకు ఆన్‌లైన్ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చేశారు. ఆయా గ్రామాల్లో భూములకు సంబంధించి రైతులకు ఎలాంటి సమస్య లేకపోవడంతో సదస్సుకు రాలేదు. రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులకు ఎవ్వరూ రాకపోవడంతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. ముందుగా వీఆర్వోలు దండోరా కూడా వేయించారు. రైతులు ఎవరూ రాకపోవడంతో సదస్సుకు తహసీల్దార్ వేణుగోపాల్ హాజరు కాకుండా తన కార్యాలయంలో పనులు చూసుకుంటూ ఉండిపోయారు. డిప్యూటీ తహసీల్దార్ శివ, మండల సర్వేయరు ప్రసాద్, ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నడిపించారు. భూ సమస్యలపై రైతులు ఎవరు రాలేదు గానీ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు, మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్ల కోసం అర కొరగా దరఖాస్తుదారులు వచ్చారు. వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి సిబ్బంది మమ అనిపించారు.

ప్రభుత్వ బడులను రక్షించుకోవడమే లక్ష్యం

- రాష్ట్రవ్యాప్తంగా ప్రచారయాత్ర
- వచ్చేనెలలో కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు



మాట్లాడుతున్న యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిశోర్‌కుమార్

మాడుగుల రూరల్ : ప్రభుత్వ బడిని రక్షించుకోవాలని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవాలని యు.టి.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో శనివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ యు.టి.ఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు వచ్చే ఏడాది జనవరి 5, 6, 7, 8, తేదీల్లో కాకినాడలో జరగనున్నాయని, ఈ మహాసభలు విజయవంతం చేయాలని కోరారు. స్వర్ణోత్సవాలు జయప్రదం కావాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 26 వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 26 జిల్లాల్లో జరుగుతున్న ప్రచారయాత్రలో భాగంగా శనివారం సాయంత్రం ఘాట్‌రోడ్డు జంక్షన్‌కు వచ్చారు. సంఘ కార్యదర్శి మురళీమోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ బడులు ఉండడం వల్ల రాజ్యాంగ విలువలు కాపాడబడతాయని, రాజ్యాంగంలో నిర్దేశించినట్టు సమసమజ లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఫెడరేషన్ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అండగా ఉండడమే కాకుండా ప్రజా పోరాటాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న చరిత్ర యు.టి.ఎఫ్‌కు మాత్రమే ఉందన్నారు. ఈ ప్రచార యాత్ర శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల మీదుగా పాడేరు నుంచి నేడు ఘాట్‌రోడ్డు, చోడవరం తదితర ప్రాంతాల్లో జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి, జిల్లా కార్యదర్శి పొలిమేర చంద్రరావు, విశ్రాంత ఉపాధ్యాయులు రాపేట రామకొండలరావు, యూనియన్ నాయకులు శరగడం జగ్గారావు, సత్తిబాబు, ఆనంద్, మురళి, మండల యూనియన్ అధ్యక్షుడు జె.పి.ఎస్ కృష్ణ రామారావు, కోటీశ్వరావు, లావణ్య, శాంతి దేవి, గానన్న పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న హోంమంత్రి అనిత, కలెక్టర్ విజయక్రిష్ణన్ తదితరులు

పాయకరావుపేట: నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో ఏపీ నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. అనిత మాట్లాడుతూ పాయకరావుపేట నియోజకవర్గంలో నాలుగేళ్లలో 60 వేలు ఉద్యోగాలు కల్పనే ధ్యేయంగా తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నక్కపల్లి మండలంలో 2029 నాటికి స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతుందన్నారు. ప్రస్తుతం మేళాకు 54 కంపెనీల ప్రతినిధులు మాత్రమే హాజరయ్యారన్నారు. రానున్న మరో మూడు నెలాల కాలంలో 200 కంపెనీలు ప్రతినిధులతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. 2,750 మంది అభ్యర్థులు హాజరు కాగా, వీరిలో 826 మందిని ఎంపిక చేశారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ ఎన్.గోవిందరావు తెలిపారు. వారిలో 300 మందికి నియామక పత్రాలు అందించినట్లు తెలిపారు. అంతకుముందు మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళిలర్పించారు. కలెక్టర్ విజయ్ కృష్ణన్, జాబ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎ.కళ్యాణి, డీఆర్‌డీఏ పీడీ సుభీదేవి, శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రముఖ వ్యాపారవేత్త రతన్ టాటా జయంతి సందర్భంగా శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల 2025 వార్షిక క్యాలెండర్‌ను హోంమంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయ్ కృష్ణన్, తదితరులు విడుదల చేశారు. టాటా కుటుంబ అపురూపమైన వారసత్వాన్ని అభినందిస్తూ, నివాళులర్పిస్తూ క్యాలెండర్ రూపొందించామని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు.

యువకుడి హత్య కేసుపై డీఎస్పీ విచారణ

- నిందితుడ్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి

చోడవరం: యువకుడు హత్య కేసుపై అనకాపల్లి డీఎస్పీ శ్రావణి శనివారం విచారణ జరిపారు. శుక్రవారం రాత్రి చోడవరం పట్టణం రెల్లి వీధికి చెందిన మేనమామ బంగారు దుర్గ, మేనల్లుడు సోమాదుల ప్రేమకుమార్ మధ్య వివాదం జరిగింది. ఈ వివాదంలో పాత బస్టాండ్ దగ్గర ప్రేమకుమార్‌ను మేనమామ దుర్గ కర్రతో తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వీరిద్దరూ చిత్తు కాగితాలు అమ్ముకుంటూ జీవిస్తున్నారు. మద్యానికి పూర్తిగా బానిసైన వీరు మధ్య డబ్బులు విషయమై వివాదం చోటుచేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. చోడవరం సీఐ అప్పలరాజు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా అనకాపల్లి డీఎస్పీ శ్రావణి చోడవరం వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్యకు దారి తీసిన వివరాలను స్థానికులను, ఇరువర్గాల కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. నిందితుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి




గణేష్ మృతదేహం

గుడివాడరూరల్ : అనకాపల్లి జిల్లాకు చెందిన ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కృష్ణా జిల్లా గుడివాడ పట్టణంలో శనివారం జరిగింది. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం బూరుగుపాలెం గ్రామానికి చెందిన వేమనపూడి గణేష్ (19) ఓ మాల్‌లో పని చేయడానికి మరికొందరు స్నేహితులతో కలసి వచ్చాడు. వారందరూ పట్టణంలోని ది నెక్స్ట్ థియేటర్ పక్క రోడ్డులోని ఓ ఇంట్లో గది తీసుకుని అద్దెకు ఉంటున్నాడు.

గణేష్ ఎప్పటి మాదిరిగానే శుక్రవారం రాత్రి పని ముగించుకుని గదికి వచ్చి భోజనం చేసి స్నేహితులతో కలసి పడుకున్నాడు. శనివారం ఉదయం స్నేహితులు నిద్ర లేపగా అతనిలో చలనం లేదు. వెంటనే గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గణేష్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టుగా నిర్ధారించారు. అవుట్‌పోస్ట్ పోలీసుల సమాచారం మేరకు ఆస్పత్రికి చేరుకున్న టూటౌన్ పోలీసులు గణేష్ మృతదేహాన్ని పరిశీలించి, అతని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. టూటౌన్ సీఐ చిన్ని నాగప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి నరసింగారావు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వలకు చిక్కిన కొండచిలువ



వలకు చిక్కిన కొండచిలువను హతమార్చిన దృశ్యం

ఎస్.రాయవరం : పెదఉప్పలం చేపల చెరువులో వలకి చిక్కిన కొండచిలువను స్థానికులు శనివారం హతమార్చారు. గ్రామానికి చెందిన పి.సూర్యనారాయణ చేపల కోసం చెరువులో వల కట్టారు. రాత్రి సమయంలో సుమారు 9 అడుగుల పొడవుగల కొండచిలువ వలలో చిక్కుకుంది. ఇది గమనించి స్థానికులు భయానికి గురై కొండ చిలువను హతమార్చారు.

క్లుప్తంగా

వర్షం నీరు నిల్వ లేకుండా చర్యలు



కాలువపై కాంక్రీట్ దిమ్మలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం కూడలిలో జాతీయ రహదారి అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో మరమ్మతు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాలను ఆనుకుని వర్షం నీరు నిల్వ లేకుండా నిర్మించిన సిమెంట్ కాలువపై క్రేన్ సహాయంతో దిమ్మలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ వర్షం పడిందంటే నీరు నిల్వ ఉండిపోయి వాహన చోదకులు, రోడ్డు పక్క దుకాణదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో కాలువ నిర్మించి వర్షపు నీరు పోవడానికి చర్యలు చేపట్టారు. సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

30న సైన్స్ ఫేర్

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం హైస్కూల్లో ఈ నెల 30న సైన్స్‌ఫేర్ ఏర్పాటు చేశామని ఎంఈవోలు సురేష్‌కుమార్, కె.వి.ఎస్. మూర్తి తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు జరిగే సైన్స్ ఫేర్‌లో హైస్కూళ్ల విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

వంద రోజుల ప్రణాళిక పర్యవేక్షణకు ప్రత్యేక బృందం

కశింకోట: టెన్త్ క్లాస్ విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన వంద రోజుల ప్రణాళికను పర్యవేక్షించడానికి మండల స్థాయిలో నలుగురు సభ్యుల బృందాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో ఎంఈవోలు సురేష్‌కుమార్, కె.వి.ఎస్. మూర్తి, కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం ఎం.వి.ఆర్. అప్పారావు, బయ్యవరం హైస్కూలు హెచ్‌ఎం రమణ పర్యవేక్షకులుగా వ్యవహరించనున్నారు. వీరు స్కూళ్లకు వెళ్లి టెన్త్ విద్యార్థులకు రూపొందించిన ప్రణాళిక అమలుపై సూచనలు, సలహాలు అందజేస్తారు. టెన్త్ విద్యార్థులకు ఆదివారం కూడా తరగతులు నిర్వహించనున్నట్లు వీరు తెలిపారు. పాఠశాల పని రోజుల్లో ఉదయం, సాయంత్రం చెరో గంట వంతున అదనపు తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం కూడా తరగతులు కొనసాగుతాయన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 1,572 బెల్లం దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,990	4,750
మొదటి రకం	3,830	4,200
రెండో రకం	3,490	3,910
మూడోరకం	3,200	3,450

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	సత్యనారాయణ స్క్రీన్-1
ముఫాసా	సత్యనారాయణ స్క్రీన్-2
యూఐ	పర్లిసాయి
మ్యాక్స్	షిర్డీసాయి
శ్రీకాకుళం షెర్లాక్ హోమ్	వెంకటేశ్వర
అమరన్	శ్రీసత్య
డ్రింకర్ సాయి	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 35 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బి పాజిటివ్-10 యూనిట్లు, ఒ పాజిటివ్-19 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 422 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 368 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన స్మార్ట్ నెట్ ప్రాథమిక పాఠశాల

విద్యార్థుల భవితను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విజయరామరాజుపేటలోని ఎంఎంసీ కాలనీ, వేల్పులవీధి, గవరపాలెంలోని పార్కు సెంటర్‌లో మూడు పాఠశాలలను నిర్మించింది. ఇందుకు గాను ఒక్కొక్క పాఠశాలకు రూ. కోటి 50 లక్షల నిధులు వెచ్చించారు. మౌలిక సదుపాయాలు కల్పించారు. ఎంఎంసీ కాలనీ, వేల్పుల వీధి పాఠశాలలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభించారు. అయితే గవరపాలెం పార్కు సెంటర్‌లోని ప్రాథమిక పాఠశాల పనులు జరుగుతున్న సమయంలో సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో తర్వాత పాఠశాల పూర్తయినా దానిని ప్రారంభించలేకపోయారు.

ప్రారంభానికి నోచుకోని.. ప్రభుత్వ పాఠశాల



భీశెట్టి అప్పారావు కల్యాణ మండపం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తి
- రూ.కోటి 50 లక్షలతో నూతన భవన నిర్మాణం
- ప్రారంభానికి మీనమేషాలు లెక్కిస్తున్న కూటమి ప్రభుత్వం
- అంగన్‌వాడీ కేంద్రంలో పాఠశాల నిర్వహణతో విద్యార్థుల ఇక్కట్లు



కల్యాణ మండపంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు



కల్యాణ మండపంలో నిద్రిస్తున్న అంగన్‌వాడీ చిన్నారులు

అనకాపల్లి: గవరపాలెం పార్కు సెంటర్‌లోని ప్రాథమిక పాఠశాలకు అన్ని మౌలిక సదుపాయలు ఉన్నప్పటికీ సుమారు 8 మాసాలుగా నిరుపయోగంగానే ఉండిపోయింది. దీంతో ఈ పాఠశాల విద్యార్థులు పక్కనే ఉన్న కల్యాణ మండపంలో చాలీచాలని మౌలిక సదుపాయాలతో విద్యను అభ్యసిస్తున్నారు. ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రం కూడా కొనసాగుతుండడంతో ఇటు విద్యార్థులు, అటు అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులు చాలీచాలని వసతితో ఇబ్బందులు పడుతున్నారు.

పాఠశాలను అందుబాటులోకి తీసుకురావాలి..

గవరపాలెం పార్కు సెంటర్‌లో అత్యాధునిక మౌలిక సదుపాయాలతో స్మార్ట్ స్కూల్‌ను రెండు అంతస్తులుగా నిర్మించారు. కూటమి ప్రభుత్వం ఈ పాఠశాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాల కింది భవనంలో తరగతుల నిర్వహణ, పై అంతస్తులో మూడు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించే విధంగా భవనాన్ని నిర్మించారు. అయితే 8 మసాలుగా ఇది నిరుపయోగంగా ఉంది.

భీశెట్టి అప్పారావు కల్యాణ మండపంలో..

సుమారు రెండేళ్ల క్రితం ప్రాథమిక పాఠశాల నిర్మించే సమయంలో పక్కనే ఉన్న భీశెట్టి అప్పారావు కల్యాణ మండపంలోకి పాఠశాలను మార్చారు. కల్యాణ మండపం హాల్లో ఒక పక్క ప్రాథమిక పాఠశాల, మరో మూడు వైపులా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ మొదలుపెట్టారు. దీని వల్ల ఇటు విద్యార్థులు, అటు అంగన్‌వాడీ పిల్లలు, సిబ్బంది రెండు సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఈ పాఠశాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకుని రావాలని పలువురు కోరుతున్నారు.

- కల్యాణ మండపంలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో రెండు సంవత్సరాలుగా విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు.
- కూటమి పాలనలో కొత్తగా ప్రభుత్వ పాఠశాలలు నిర్మించికపోయినా పర్వాలేదు కాని, ఇప్పటికే నిర్మించిన పాఠశాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.
- కల్యాణ మండపంలో 30 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు.
- సంతోషిమాత గుడి-2 అంగన్‌వాడీ కేంద్రంలో ఆరుగురు చిన్నారులు ఉన్నారు.
- దాసరి గెడ్డ రోడ్డు అంగన్‌వాడీ కేంద్రంలో ఐదుగురు చిన్నారులు ఉన్నారు.
- గౌరీ సంఘం అంగన్‌వాడీ కేంద్రంలో ఐదుగురు చిన్నారులు ఉన్నారు.
- ఈ మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తంగా 16 మంది చిన్నారులకు ముగ్గురు అంగన్‌వాడీ టీచర్లు, ముగ్గురు ఆయాలు సేవలందిస్తున్నారు.

త్వరలో విద్యార్థులకు అందుబాటులోకి పాఠశాల..

గవరపాలెం పార్కు సెంటర్ పాఠశాల నిర్మాణం పూర్తి అయిన విషయం తెలిసిందే. భీశెట్టి అప్పారావు కల్యాణ మండపంలో విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులను దృష్టిలో పెట్టుకుని ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో పాఠశాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తాం.
– కోటేశ్వరరావు, ఎంఈవో-2, అనకాపల్లి

30న స్కూలు నిర్వహణ కమిటీలకు శిక్షణ

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో ఈ నెల 30న జిల్లా స్థాయి స్కూలు నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ)లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఈవోలు సురేష్‌కుమార్, కె.వి.ఎస్. మూర్తి తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో స్కూలు కమిటీల విధులు, బాధ్యతలు, ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు.

జీవో 77 రద్దు చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

అనకాపల్లి: తాము అధికారం చేపట్టిన వెంటనే జీవో 77ను రద్దు చేస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బాదపు హరికృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.బాజ్జీ అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని కోడుగంటి గోవిందరావు భవనంలో ఈనెల 30న జరగనున్న విద్యార్థుల భారీ బహిరంగ సభ గోడ పత్రికలను ఆవిష్కరించి, రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ప్రభుత్వం ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభ్యసిస్తున్నారని, వారు జీవో 77 వల్ల విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫీజ్ రీయింబర్స్‌మెంట్ నగదును విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లో కూటమి ప్రభుత్వం తక్షణమే జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు కుమార్, రుద్రి, జగదీష్, సింహాద్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మాలధారణ దీక్షలు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో ముత్యమాంబ మాలధారణ దీక్షలు శనివారంతో ముగిశాయి. ఈ నెల 20న మాలాధారణ వేసిన భక్తులు దీక్షలు తొమ్మిది రోజులు పూర్తి కావడంతో ఆలయం నుంచి ఊరేగింపుగా పురవీధుల్లో తిరిగారు. అనంతరం ఆలయం వద్ద మాలాధారణ విడిచారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆడారి బాబ్జి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

గ్రామాల్లో ఖరీఫ్ వరి పంట కోత ప్రయోగాలు



తేగాడలో వరి పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది



పంట దిగుబడి తూకం వేస్తున్న వ్యవసాయ విస్తరణాధికారి నూక శ్రీనివాసరావు

కశింకోట: మండలంలోని మూడు గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్ వరి పంట కోత ప్రయోగాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం దిగుబడిని లెక్కించారు. సుమారు 250 ఎకరాలను ఒక యూనిట్‌గా తీసుకుని 34 పంట కోత ప్రయోగాలు మండలంలో నిర్వహించాల్సి ఉంది. దీనిలో భాగంగా బయ్యవరం, తేగాడ, ఉగ్గినపాలెం గ్రామాల్లో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. అసిస్టెంట్ గణాంక అధికారి సునీత, వ్యవసాయ విస్తరణాధికారి ఎ. నూక అప్పారావు, ఉద్యానవన సహాయకుడు కె. నాగేశ్వరరావు, వ్యవసాయ సహాయకుడు ఫిరోజ్‌ఖాన్‌లు బృందాలుగా ఏర్పడి రైతుల సహాయంతో ముందుగా గుర్తించిన భూముల్లో వరి పంటను కోసి ధాన్యాన్ని సేకరించారు. 5 అడుగుల పొడవు, 5 అడుగుల వెడల్పుతో చతురస్రాకారంగా పండిన వరి పంట కోసి సేకరించారు. ధాన్యాన్ని దులిపి వాటిని తూకం వేసి దిగుబడిని లెక్కించారు. బయ్యవరంలో 12.3 కిలోలు, తేగాడలో 10.6, ఉగ్గినపాలెంలో 10.22 కిలోల వంతున సరాసరి దిగుబడి వచ్చింది. ఐదారు చోట్ల తప్ప దాదాపు ప్రయోగాలు ముగింపు దశకు చేరుకున్నాయని, మొత్తం మీద దిగుబడి ఆశాజనకంగానే ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు. అధికారులు, సిబ్బందితో పాటు రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు కార్తీక వన సమారాధన



రక్తదానం శిబిరం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

అనకాపల్లి: స్థానిక రింగ్ రోడ్డు ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ ఆవరణలో ఆదివారం ఉదయం 9 గంటలకు గవర సంక్షేమ సంఘం కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు కొణతాల చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక బెల్లం మార్కెట్ ఆవరణలో శనివారం మెగా రక్తదాన శిబిరం కరపత్రాలను సర్వేజన ఐక్యవేదిక వ్యవస్థాపకుడు కోరిబిల్లి పరి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. 10 గంటలకు వధూవరుల పరిచయ వేదిక, మహిళలు, పురుషులు, చిన్నపిల్లలకు ఆటల పోటీలు, ఉచిత వైద్య శిబిరం, మిమిక్రీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'అమిత్‌షా క్షమాపణ చెప్పాలి'



నిరసన తెలియజేస్తున్న రేబాక మధుబాబు తదితరులు

అనకాపల్లి: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ని అగౌరవపరిచిన అమిత్‌షా క్షమాపణ చెప్పాలని జై భీమ్ సేన సేవా సంఘం ప్రతినిధి రేబాక మధుబాబు అన్నారు. స్థానిక నెహ్రూచౌక్‌లో అంబేడ్కర్ విగ్రహానికి సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేసి అంబేడ్కర్ చిత్రపటాలతో అమిత్‌షాకు వ్యతిరేకంగా శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని చక్కగా అమలు పరిచే ఆలోచన చేయాలని అన్నారు. ప్రధాని ఎక్స్ వేదికగా అమిత్‌షా వాఖ్యలను సమర్థించడం మరొక విచిత్రమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విల్లూరు పైడారావు, సంఘం ప్రధాన కార్యదర్శి మల్లవరపు రామచంద్, పలు సంఘాల నాయకులు బేలా శివగణేష్, పిల్లి అప్పారావు, ఎర్రంశెట్టి భవానీ, బుజ్జిబాబు, దండు సూర్యనారాయణ, ఎర్రంశెట్టి గురయ్య, గుడాల ఆనంద్, బండి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వామనావతారంలో వేంకటేశ్వరస్వామి



వామనావతారంలో అంజయ్య కాలనీ వేంకటేశ్వరస్వామి



వామనావతారంలో దర్శనమిచ్చిన ధ్యాన వేంకటేశ్వరస్వామి



లక్ష్మీ నృసింహస్వామిగా దర్శనమిచ్చిన గవరపేట వేంకటేశ్వరస్వామి

అనకాపల్లి: స్థానిక గాంధీనగరం అంజయ్యకాలనీ వేంకటేశ్వరస్వామి శనివారం భక్తులకు వామనావతారంలో దర్శనమిచ్చారు. తెల్లవారు జాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి గోప అప్పలాచార్యులు (చక్రవర్తి) మాట్లాడుతూ ఆది, సోమ వారాల్లో భక్తులకు వామనావతారంలో స్వామి వారి దర్శనం కలిగించనున్నట్లు తెలిపారు. ధనుర్మాసం సందర్భంగా స్వామివారికి ప్రతి రోజు తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట.. గవరపేటలో..

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామిని విష్ణుమూర్తి దశావతారాల్లో ఐదవ అవతారంగా స్వామిని అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. రాత్రి మహిళలు కోలాటాలు ప్రదర్శించారు. నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అలాగే గవరపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని లక్ష్మీనృసింహ అవతారంతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా విష్ణు మూర్తి నాలుగవ అవతారంగా అలంకరించారు. పెద్ద తులసి మాలను హారంగా వేసి పూజించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు, అర్చకుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు



గౌరీపరమేశ్వరులను దర్శించుకుంటున్న జానకీ రామరాజు దంపతులు, భక్తులు

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో గ్రామదేవత ఉత్సవాలు నిర్వహించాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. పెరుగుబజార్ జంక్షన్‌లోని కుంచావారి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వారు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జానకీ రామరాజు మాట్లాడుతూ డిసెంబర్, జనవరి మాసాల్లో కుంచావారి, వేల్పులవీధి, గవరపాలెం గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవాలను ఆయా కమిటీ సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, మాజీ ఎన్టీఆర్ ఆస్పత్రి డైరెక్టర్ మునూరు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కోన ఉమ, ఆలయ చైర్మన్ ఎం.వీ రభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పాలు, రొట్టెల పంపిణీ



ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న రామ్మూర్తి

అనకాపల్లి: ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో గర్భిణులకు ఉచితంగా పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ డాక్టర్ జి.రామ్మూర్తి మాట్లాడుతూ గర్భిణులు పౌష్టిక ఆహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ వైస్ చైర్మన్ డాక్టర్ హిమజా విరణ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రతన్‌టాటాకు ఘన నివాళి



రతన్‌టాటా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘం ప్రతినిధులు

అనకాపల్లి: ప్రముఖ పారిశ్రామిక వేత్త, మానవతావాది, భారతరత్న అవార్డు గ్రహీత రతన్ టాటా జయంతి స్థానిక మళ్లవీధిలో లాల్ బహదూర్ శాస్త్రి యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం జరిగింది. సంఘం ప్రతినిధులు సరిస ధర్మ, ఎల్లపు రామారావు రతన్‌టాటా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ఎంతో మందికి తన వంతు ఆర్థిక సహాయం చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిన మహనీయుడు రతన్‌టాటా మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. దేశం కోసం ఏమైనా చేయాలంటే ప్రథమంగా ఆయనే స్పందించి తన వంతు సహాయ సహకారాలు అందించేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు దొడ్డి కృష్ణారావు, శ్రీను, ఆళ్ల గోవింద్, మల్ల నాగేశ్వరరావు, రాజేంద్ర, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో ఆరోగ్యకర పంటల దిగుబడి

దేవరాపల్లి: ఆధునిక పద్ధతుల్లో తక్కువ మోతాదులో యూరియా, పురుగుల మందులను వినియోగించి సాగు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు దిగుబడి అవుతాయని చోడవరం ఏడీఏ వి.రవీంద్రనాథ్ అన్నారు. ఆధునిక పద్ధతుల్లో పండించిన కొత్తపంటకు చెందిన 21 మంది రైతుల నుంచి వరి విత్తన నమూనాలను శనివారం సేకరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి కిరణ్‌కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.